క్లుప్తంగా

అపరిశుభ్రంగా ఎంపీడీఓ కార్యాలయం



కోడేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. కార్యాలయం ఎదుట చెత్త చెదారం, చెట్ల ఆకులు రాలిపోయి అపరిశుభ్రంగా కనిపిస్తోంది. అటెండర్లు ఉన్న కూడ చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త చెదారాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



కోడేరు: మెనూ ప్రకారం భోజనం అందించాలని డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, మోడల్ స్కూల్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్‌గా కేతూరి ధర్మతేజ

కొల్లాపూర్: రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్‌గా పెంట్లవెల్లి మండలం కొండూరు గ్రామానికి చెందిన కేతూరి ధర్మతేజ నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి సంస్థ కన్వీనర్‌గా నియమించిన మంత్రికి ధర్మతేజ కృతజ్ఞతలు తెలిపారు.

పంట రుణాల రెన్యూవల్ చేయించుకోండి

లింగాల: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) ద్వారా తీసుకున్న పంటల రుణాలు, ఎల్టీ లోన్స్‌ను ఈ నెల చివరి వరకు రెన్యూవల్ చేయించుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సీఈఓ పాండు బుధవారం ఒక ప్రకటనలో రైతులను కోరారు. ఎల్టీ లోన్స్‌కు సంబంధించి 40 మంది, పంటల రుణాలకు సంబంధించి 420 మంది రైతులు రెన్యువల్ చేసుకోలేదని పేర్కొన్నారు. ఈ నెల చివరి వరకు రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి



చారకొండ: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ దుగ్గి విశ్వనాథం 71వ జయంతి సందర్భంగా బుధవారం ఆయన స్థూపం వద్ద సీపీఐ జిల్లా నాయకులు గ్రామస్తులు పూలమాలలతో నివాళులర్పించారు. సర్పంచ్‌గా విశ్వనాథం గ్రామానికి 14 సంవత్సరాలు సేవలు అందించారని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో దుగ్గి అనిల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, నాయకులు నారాయణ రెడ్డి, పాండు, బ్రహ్మం, శంకరయ్య, లెనిన్, వేణుగోపాల్ రెడ్డి, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన ఉప్పల వెంకటేష్

కల్వకుర్తిరూరల్: హైదరాబాద్‌లో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆయన నివాసంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేస్తానని ఉప్పల తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దుప్పి మృతి

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి వటువర్లపల్లి సమీపంలోని బోరెడ్డిపల్లి బావి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చుక్కల దుప్పి మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నది. అటవీశాఖ అధికారి తెలిపిన వివరాల ప్రకారం వన్యప్రాణి చుక్కల దుప్పి రోడ్డు దాటుతుండగా సంగారెడ్డి డిపోకు చెందిన బస్సు వేగంగా వచ్చి దుప్పిని ఢీ కొట్టింది. దీంతో దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. అటవీశాఖ వాచర్లకు సమాచారం తెలియడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి డ్రైవర్‌కు రూ. 15,000 జరిమానా విధించినట్లు తెలిసింది. అనంతరం అక్కడే అటవీ పరిసర ప్రాంతంలో దుప్పిని పూడ్చివేశారు.

మెస్ సౌకర్యం కల్పించాలి



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో మెస్ సౌకర్యం కల్పించాలని, ప్లేగ్రౌండ్ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు కళాశాల విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. బుధవారం కొల్లాపూర్‌లో మంత్రిని కలిశారు. కళాశాలలో హాస్టల్స్ మెస్ సౌకర్యం లేదని పేర్కొన్నారు. అదేవిధంగా క్రీడల కోసం స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పీయూ జేఏసీ చైర్మన్ బత్తిని రాము, బీఆర్‌ఎస్‌వీ నాయకులు డి.శేఖర్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు భరత్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

మార్నింగ్ వాక్

పట్టణంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఆయన నివాసం ఎదుటే ఉండే కల్లు విక్రయదారులతో మాట్లాడారు. నాణ్యమైన కల్లును ప్రజలకు విక్రయించాలని సూచించారు. రహదారి వెంట పొలం పనులు చేస్తున్న మహిళా కూలీలతో ముచ్చటించారు. పంటల సాగు, దిగుబడి అంశాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు మంత్రి సమక్షంలో చేరారు. మంత్రి వెంట నాయకులు హన్మంతునాయక్, నాగరాజు, రాజశేఖర్‌గౌడ్, కృష్ణమనాయుడు, కిషోర్‌యాదవ్, రమేష్‌ముదిరాజ్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను నాగర్‌కర్నూల్ ఆర్డీఓ సురేష్ బుధవారం తనిఖీ చేశారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితాను పరిశీలించారు. అంతేకాకుండా ఎన్నికల సిబ్బందికి ఎంపిక చేసిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు అందరూ సిద్ధం కావాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన చోట మరమ్మతు చేయాలని సూచించారు. మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ జేకే మోహన్‌తో కలిసి ఆర్డీఓ సందర్శించారు. ఆర్‌ఐ పవన్‌కుమార్ ఉన్నారు.

కల్వకుర్తి: ఎన్నికల నియమావళి అందరూ పాటించాలని ఆర్డీఓ శ్రీనునాయక్ కోరారు. బుధవారం పట్టణంలోని కార్యాలయంలో ఆర్డీఓ అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికల నిబంధనలు వివరించారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. 80 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఇంటివద్దనే ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విజయ్‌కుమార్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, విజయ్‌గౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న డీకే మాదిగ

కొల్లాపూర్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా నోటిఫికేషన్లు ఇచ్చిన ఒక్క ప్రభుత్వ ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదన్నారు. గురుకుల పోస్టులు, స్టాఫ్‌నర్స్ పోస్టులు, పోలీసు నియామకాల ప్రక్రియ అంతా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా పోస్టుల భర్తీ నిలిచిందని, ఎన్నికలు ముగిశాక అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా పోస్టుల నియామకాలు చేపట్టిందన్నారు. ఈ పోస్టుల భర్తీ కాంగ్రెస్ ఖాతాలోకి రాదన్నారు. కొత్తగా ఉద్యోగాల నియామకాల ప్రక్రియ చేపట్టి నిరుద్యోగులకు ఆదుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో శీలం వెంకటేష్, రాముడు ఉన్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు



కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఎంపీపీ మనోహర



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ ఉమామహేశ్వరి

కల్వకుర్తిరూరల్: వేసవికాలంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మనోహర అధికారులను కోరారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మొదట ఎజెండాలోని అంశాల ప్రకారం వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా తోటపల్లి ఎంపీటీసీ రవిందర్‌రెడ్డి, కుర్మిద్ద ఎంపీటీసీ శంకర్‌నాయక్ పలు సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. పాలబిల్లులు మూడు నెలలుగా రావడం లేదని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రెండు నెలలుగా ఉపాధి కూలీలకు డబ్బులు అందడం లేదని పేర్కొన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరాములు, వివిధ శాఖల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. పలు సమస్యలను అధికారులు సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంపీపీ ఉమామహేశ్వరి మాట్లాడుతూ సర్పంచ్‌ల పదవి కాలం ముగిసిందని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పంచాయతీ సెక్రెటరీలు కృషి చేయాలని కోరారు. ఏపీఎం గౌస్‌ద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాలకు మూడు నెలల వడ్డీ లేని రుణాలను మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, వైస్ ఎంపీపీ భీంరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు, కోఆప్షన్ మతీన్, ఎంపీఓ భరత్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శిక్షణ

బిజినేపల్లి: వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే నిరుద్యోగ గ్రాడ్యుయేట్లకు ఈ నెల 26న హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ వద్ద శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాలెం వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డా.మల్లారెడ్డి బుధవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు బయో పెస్టిసైడ్స్, బయో ఫర్టిలైజర్, ఆయిల్ ప్రాసెసింగ్ యూనిట్లు, సేంద్రియ వ్యవసాయ వనరులు వంటి వాటిని స్థాపించడానికి లభించే వివిధ సబ్సిడీ, రుణ పథకాల గురించి నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, విశ్వవిద్యాలయ ఏజీహెచ్‌యూబీ సీఈవో విజయ్‌లు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

చెత్త బుట్టల పంపిణీకి విరాళం



కల్వకుర్తి టౌన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పట్టణంలోని పలు వ్యాపారాల సముదాయాల వద్ద చెత్తను వేసేందుకు చెత్తబుట్టల పంపిణీకి కాంగ్రెస్ యువ నాయకుడు ఆశాదీప్ రెడ్డి విరాళాన్ని అందించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అశ్రిత్ కుమార్‌కు రూ.80 వేల చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన జనార్దన్‌రెడ్డి



కల్వకుర్తిరూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు భారత రాష్ట్ర సమితి జిల్లా నాయకుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, సమక్షంలో బీజేపీలో చేరారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



పెద్దకొత్తపల్లి: మండలంలోని కొత్తయాపట్ల ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థి ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఉపాధ్యాయురాలు గౌరమ్మ పాల్గొన్నారు.

జగదీశ్వర్‌రావుకు సన్మానం



పెద్దకొత్తపల్లి: రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంఘం చైర్మన్ సీఆర్ జగదీశ్వర్‌రావును బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య హైదరాబాద్‌లో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ జ్యోతిపరోశియా అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ సిబ్బంది, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తాగునీటి సమస్య రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పైపులైన్ అవసరమైన చోట పైపులైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు.

జూపల్లిలో ఇఫ్తార్

చారకొండ: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మండలంలోని జూపల్లిలో ముస్లింలకు బుధవారం మాజీ ఉప సర్పంచ్ జగపతి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రవి, సైదులు బిక్కన్, అబ్దుల్లా, అజీం, రియాజ్, సీరాజ్, యువకులు ఉన్నారు.

బెల్టు దుకాణాలపై దాడులు

లింగాల: మండలంలోని అప్పాయపల్లి, రాంపూర్ గ్రామాల్లో మంగళవారం రాత్రి పోలీసులు బెల్టు షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. అప్పాయపల్లిలో భానుప్రకాష్, రాంపూర్‌లో శ్రీకాంత్, చంద్రశేఖర్‌లు ఎలాంటి అనుమతులు లేకుండా కిరాణం దుకాణాలలో మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. దుకాణాల్లో మద్యం కాటన్లు స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాములలో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 6 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సారా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ కల్యాణ్, కొల్లాపూర్ ఎక్సైజ్ ఎస్‌ఐ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో బుధవారం గ్రామానికి చెందిన మాద్గుల శ్రీను అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తూ పట్టుబడినట్లు ఏఎస్‌ఐ సుజ్ఞానం తెలిపారు. అతని వద్ద నుంచి 12 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కారు, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు

తాడూరు: కారు, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ఇంద్రకల్ గ్రామానికి చెందిన నాగమ్మ, నారయ్యలు యాదిరెడ్డిపల్లి నుంచి బైక్‌పై తాడూరుకు వెళ్తున్నారు. అదేసమయంలో ఇంద్రకల్ నుంచి యాదిరెడ్డిపల్లికి వెళ్తున్న కారు యాదిరెడ్డిపల్లి సమీపంలో బైక్‌ను ఢీకొన్నది. బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పాలెంలో ఎల్‌సీడీసీ సర్వే



బిజినేపల్లి: మండలంలోని పాలెంలో వైద్య సిబ్బంది ఇంటింటి ఎల్‌సీడీసీ సర్వే నిర్వహిస్తున్నట్లు హెల్త్ అసిస్టెంట్ గోవర్దన్ తెలిపారు. ఈ నెల 24వ తేదీన సర్వే ముగుస్తుందని పేర్కొన్నారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి లెప్రసీ లక్షణాలు కలిగిన ఉన్నవారిని గుర్తిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గజవర్ధనమ్మ, సంధ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం




కోడేరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని ఎత్తంలో మూడో అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్న గుడ్లు, పాలు, బాలామృతం, ఆకుకూరలు, పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి

కొల్లాపూర్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణానికి చెందిన గాయత్రి విద్యాసంస్థల నిర్వాహకులు, రాష్ట్ర ప్రైవేట్ కళాశాలల సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేధావుల ఫోరం కమిటీ చైర్మన్ శ్యాం మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యారంగం సమస్యలను వివరించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరారు. ప్రైవేటు కళాశాలల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలపై పునరాలోచన చేయాలని, కళాశాలల్లో ఉచిత అడ్మిషన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ప్రైవేటు కళాశాలల సంఘం నాయకులు ఉన్నారు.

మల్లురవికి సన్మానం



పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ మల్లురవి పేరును ప్రకటించడంతో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మారేడు గోపాల్ బుధవారం శంషాబాద్ విమానాశ్రయంలో మల్లురవిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వల్లభరెడ్డి, వెంకటస్వామి, రమేశ్‌రెడ్డి, సంజయ్ పాల్గొన్నారు.

వెల్దండ: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురని హైదరాబాదులో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, నాయకులు పర్వత్‌రెడ్డి, శేఖర్, పుల్లయ్య, ఎర్రశ్రీనుముదిరాజ్, రమేష్, తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: మల్లురవిని బుధవారం రాత్రి తోటపల్లి మాజీ సర్పంచ్ రాజేష్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



బ్యాటింగ్ చేసి టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

మన్ననూర్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్ల బావి గ్రామంలో ఏర్పాటు చేసిన కటకం వీరభద్రాచారి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భాన్ని ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం కలుగుతుందన్నారు. స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. అనంతరం నిర్వాహకుడు కటకం శ్రీనివాసా చారి మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం క్రీడాపోటీలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతిగా రూ. 50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 25 వేలు అందిస్తామన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కోరె రేణయ్య పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. దివాకర్, అంజనారాయణ, రాంబాబు, లింగం, నవీన్, హరినారాయణగౌడ్, వెంకటేశ్వర్లు, బాలింగం గౌడ్, రేణయ్య, రాములు, కృష్ణయ్య, అంబనారాయణ, జగన్ పాల్గొన్నారు.

టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు



కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ అకాడమీ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ ప్రారంభించారు. వృత్తి నైపుణ్యాలను పెంచుకునేందుకు శిక్షణలు దోహదపడతాయన్నారు. చదువుతో పాటు, వృత్తి నైపుణ్యాలు సాధించేలా శిక్షణలను ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో టాస్క్ కన్వీనర్ వెంకటయ్య, రిసోర్స్ పర్సన్ టీ.వెంకటేష్‌తో పాటు కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

పశువుల సంత వేలం రూ.68 లక్షలు



తెలకపల్లి: మండల కేంద్రంలోని పశువుల సంతను బుధవారం గ్రామ పంచాయతీ వద్ద వేలం పాట నిర్వహించారు. వేలంలో మధుకర్‌రెడ్డి పశువుల సంతను రూ.68 లక్షలకు, రెడ్డపాకుల సతీష్ తైబజారు రూ.60 లక్షలకు దక్కించుకున్నారు. అదే విధంగా బస్టాండ్ వద్ద ఉన్న దుకాణ సముదాయానికి అద్దెకోసం సాయిబాబు నెలకు రూ.39 వేలు పాడారు. ఎంపీఓ వెంకటయ్య, కార్యదర్శి ఈఓ విజయభాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంకర వేశారు.. బీటీ మరిచారు



నెమలిగుట్ట తండాకు వెళ్లే దారి ఇలా..

చారకొండ: మండలంలోని జేపల్లి పంచాయతీ పరిధిలోని నెమలిగుట్ట తండాకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం ఎస్టీఎఫ్‌డీఎస్ కింద రూ.2.70 కోట్లు మంజూరు అయ్యాయి. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్ గత సంవత్సరం పనులు ప్రారంభించారు. అక్టోబర్‌లో కంకర పరిచారు. కాని అప్పటి నుంచి బీటీ పనులు చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో తండా ప్రజలు, విద్యార్థులు నిత్యం కంకరపై ప్రయాణించేందుకు జంకుతున్నారు. పలువురు వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలబారిన పడ్డారని స్థానికులు వాపోయారు. రోడ్డు పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు చెబితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పున్నారని తండావాసులు ఆరోపించారు. అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డును పూర్తి చేయాలని తండావాసులు కోరుతున్నారు.